
# నీ దరి చేరాలని...

సి.ఎన్. చంద్రశేఖర్

ఆఫీసు నుంచి యింటికి వచ్చిన శేఖర్‌కు వాకిట్లో చెల్లెలు పద్మ కనిపించి ''అన్నయ్యా, నీకో ఉత్తరం వచ్చింది'' అంది నవ్వుతూ.

''ఎక్కడ్నుంచి?'' శేఖర్ అడిగాడు.

''బెంగుళూరు నుంచి. నువ్వు నేను అనుకొన్నంత అమాయకుడివి కాదన్నయ్యా'' అంది అతన్ని ఓరగా చూస్తూ.





## వెనిస్ కెనాల్

వెనిస్ మహానగరంలో వందసంవత్సరాల క్రితం వెలిసిన కెనాల్ ఇది అంటారు. ఈ మహా నగరానికి తాగునీటితో పాటు పారిశ్రామిక రంగానికీ ఈ కెనాల్ ఎంతో ఉపయోగపడుతోంది. నగరంలో సుమారు ఇరవై కిలోమీటర్ల వరకూ ప్రయాణించే ఈ కెనాల్‌కు ఇరువైపులా గొప్ప కట్టడాలు వెలిసాయి. సాయంత్రపు ఆనందాలకోసం పిల్లలూ, పెద్దలూ ఇందులో బోటు షికారు చేస్తుంటారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలోనూ వెనిస్ కెనాల్‌కు పెద్ద పేరుంది.

ఆమె మాటలు అర్థంకాక యింట్లోకి వెళ్ళి లెటర్ బాక్స్ చూశాడు. అందులో ఉత్తరం లేదు. వంటగదిలోకి వెళ్ళి తల్లిని ఉత్తరం గురించి అడిగాడు.

''ఉత్తరం ఇస్తాగాని షాలిని ఎవరు?'' అని అడిగింది శ్యామల.

''షాలిని ఎవరు?'' శేఖర్ తిరిగి అదే ప్రశ్న తల్లికి వేశాడు.

''నాకేం తెలుసు? నీకే తెలియాలి'' అంటూ అల్మైరాలో వున్న పోస్ట్‌కార్డ్ తీసి అతనికిచ్చింది. శేఖర్ ఉత్తరాన్ని చదవసాగాడు.

''డియర్ శేఖర్. బాగున్నావా? నీవు చిత్తూరుకు వెళ్ళాక నాకు ఉత్తరం రాయలేదు. ఫోన్ కూడా చెయ్యలేదు. నా మీద కోపమా? శేఖర్... మా పిన్ని పెట్టే బాధలు భరించలేకుండా వున్నాను. నీవు వచ్చి నీతో నన్ను తీసుకెళ్ళే రోజుకోసం ఆశగా ఎదురుచూస్తున్నాను. వీలైనంత త్వరగా వస్తావు కదూ.

నీ - షాలిని''

ఉత్తరం చదివాక అడ్రసు చూశాడు. తన అడ్రసే. ఇంటి నెంబరుతో సహా అన్నీ సరిపోయాయి. మరి ఎవరీ శేఖర్? ఈ వీధిలో యింకో శేఖర్ ఎవరైనా కొత్తగా వచ్చి చేరి వుండొచ్చు. ఇంటి నెంబరు అటూ యిటూ చేసి రాసి వుండొచ్చు. మరి ఆ శేఖర్‌ను ఎలా కనుక్కోవాలి? ఈ ఉత్తరాన్ని అతనికి ఎలా చేర్చాలి?'' అనుకొన్నాడు శేఖర్ మనసులో.

''ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నావా?'' శ్యామల అడిగింది.

''కాదు. ఈ ఉత్తరాన్ని అసలు శేఖర్‌కు ఎలా అందజెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. నిజంగా ఆ షాలిని ఎవరో నాకు తెలియదమ్మా'' అన్నాడు అమాయకంగా.

''తమాషాకు అన్నానురా. నీ గురించి నాకు తెలియదా? ఒకవేళ అటువంటిది వుంటే నాకు చెప్పకుండా వుండగలవా నువ్వు? రా. భోజనానికి కూర్చుందువుగాని''.

ఉత్తరాన్ని తన టేబుల్ సొరుగులో పడేశాడు శేఖర్. ఆ తర్వాత ఆ ఉత్తరం విషయం మరిచిపోయాడు.

వారం రోజుల తరువాత యింకో ఉత్తరం వచ్చిందతనికి షాలిని దగ్గర్నుంచి.

''డియర్ శేఖర్. నా ఉత్తరం అందిందా? జవాబు రాయలేదేం? నీ ఉత్తరంకోసం ఎంత ఆత్రతతో ఎదురు చూస్తున్నానో తెలుసా? నీ ఉత్తరం చూస్తే నిన్ను చూసినంత ఆనందం కలుగుతుంది నాకు. నీ ప్రతి అక్షరంలో అందమైన నీరూపం కనిపిస్తుంది. ప్రతి పదంలో నీకు నాపై వున్న ప్రేమ కనిపిస్తుంది. నా కష్టాలను చూసి చలించే నీ సున్నితమైన మనసు, నాకోసం ఏదైనా చెయ్యాలనుకొనే నీ అచంచలమైన ప్రేమ నన్నింకా బ్రతికిస్తున్నాయి శేఖర్. నా జీవితానికి అర్థం, ఆశ అన్నీ నువ్వే. నీ నిర్లక్ష్యాన్ని నేను భరించలేను. దయచేసి ఉత్తరం రాస్తావు కదూ - నీ షాలిని''.

ఉత్తరం చదివిన శేఖర్‌కు ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆమె ఉత్తరంలోని ఆర్ద్రత అతని మనసును కదిలించింది. ఆ ఉత్తరాన్ని తిరిగి ఆమెకే పంపిస్తూ, అవి పొరపాటుగా తనకు చేరాయనీ, అడ్రసు సరిచూసుకొని ఆమె ప్రియునికి పంపమని ఉత్తరం రాయాలన్న ఆలోచన వచ్చిందతనికి. కాని ఆమె రాసిన రెండు ఉత్తరాలలోనూ తన చిరునామా రాయలేదు. బెంగుళూరు అని మాత్రమే రాసింది. ఆ ఉత్తరాన్ని కూడా తన టేబుల్ సొరుగులో పడేశాడు శేఖర్.

* * *

పది రోజుల తర్వాత షాలిని నుంచి యింకో ఉత్తరం అందింది శేఖర్‌కు.

''డియర్ శేఖర్. నీకు నా మీద ఆసక్తి తగ్గిందో, ప్రేమ తగ్గిందో నాకు తెలియడం లేదు. నీ ఉత్తరం కోసం ప్రతిరోజూ ఎదురుచూసిన నాకు నిరాశే వరించింది. జీవితంపై ఆశ నశించింది.

మా పిన్ని సాధింపులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ఇక భరించడం నావల్ల కాదు. అందుకే నేను యిల్లు వదిలి చిత్తూరు వచ్చేస్తున్నాను. ప్రతి శనివారం సాయంత్రం పిన్ని తన పిల్లలతో సినిమాకెళుతుంది. వాళ్ళు బయటకు వెళ్ళగానే నేను యింటినుంచి బయలుదేరతాను. మెజిస్టిక్‌లోని బస్టాండు మా యింటికి చాలాదూరం. నేను బస్టాండు చేరేసరికి రాత్రి ఏడు గంటలు దాటొచ్చు. ఎనిమిది గంటలకు చిత్తూరు వెళ్ళే బస్సు వుందని బస్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే చెప్పారు. ఆ బస్సు రాత్రి పన్నెండు గంటలకు చిత్తూరు చేరుతుందట. నువ్వు బస్టాండుకు వచ్చి నన్ను మీ యింటికి తీసుకెళతావని ఆశిస్తున్నాను. నీవు రాకపోతే ఆత్మహత్య చేసుకోవాలా లేక తిరిగి యింటికి వెళ్ళి మా పిన్నిని బ్రతిమాలుకోవాలా యింకా ఆలోచించుకోలేదు. ఎందుకంటే నువ్వు తప్పకుండా వస్తావన్న నమ్మకం నాకుంది - షాలిని.''

ఉత్తరం చదివిన శేఖర్‌కు ఈసారి విసుగుతో కూడిన కోపం వచ్చింది షాలిని పైన. కనీసం తన ఉత్తరాలు ఆ శేఖర్‌కు చేరుతున్నాయో, లేదో అని కూడా ఆలోచించకుండా ఆమె బయలుదేరి రావడం, అదీ రాత్రిపూట ప్రయాణం పెట్టుకోవడం అతన్ని చికాకు పరచింది.

శనివారం రాత్రి భోజనాలప్పుడు పద్మ శేఖర్‌తో ''అన్నయ్యా. బస్టాండ్‌కు నేనూ నీతోపాటు వస్తాను. నువ్వొక్కడివే వెళ్తే నీతో రావడానికి సందేహించవచ్చు ఆవిడ'' అంది.

''నేను వెళితేగా నువ్వు రావడానికి''.

''నువ్వు బస్టాండుకు వస్తావని ఎంతో నమ్మకంగా వుంది షాలిని.''

''నేను కాదు. ఆమె ప్రేమించినబ్బాయి వస్తాడని''.

శేఖర్ తండ్రి మోహనరావు కల్పించుకుంటూ ''నువ్వు వెళ్ళి ఆ అమ్మాయిని మన యింటికి తీసుకుని వస్తే మంచిదని అనిపిస్తుంది నాకు. అర్థరాత్రి అలా ఆడపిల్లను తెలిసి వదిలేయడం ధర్మంకాదు. రోజులు కూడా బాగాలేవు'' అన్నాడు.

''నాకు అంతసేపు నిద్ర ఆపుకోవడం కష్టం నాన్నా. పది గంటలకే నిద్రపోయే అలవాటు చేసింది మీరే'' అన్నాడు నవ్వుతూ.

పది గంటలకు పడుకొన్న శేఖర్‌కు వెంటనే నిద్ర పట్టింది. అయితే గంటసేపటికే మెలకువ వచ్చేసింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర రాలేదు. మనసులో షాలిని గురించి ఆందోళన వుండడం వల్లే తనకు మెలకువ వచ్చిందని, తర్వాత నిద్ర పట్టలేదని అర్థమైంది అతనికి. లేచి దుస్తులు మార్చుకుని హాల్లోకి వచ్చాడు. తల్లి దండ్రులిద్దరూ టీవీలో సినిమా చూస్తున్నారు.

''నేను బస్టాండుకు వెళ్ళి వస్తాను నాన్నా''

అన్నాడు తండ్రితో.

''వెరీగుడ్. నాకు తెలుసు నువ్వు వెళ్తావని. మనం మనుషులంరా. మనకెందుకులే అని వుండలేము. నేనూ తోడుగా రానా బస్టాండుకు''.

''వద్దు నాన్నా. అవసరమయితే నేను ఫోన్ చేస్తాలే. మీరు విశ్రాంతి తీసుకోండి'' అని తన మోటర్‌బైక్ బయటకు తీసి స్టార్ట్ చేశాడు.

బెంగుళూరు నుంచి బస్సు పన్నెండు పదికి వచ్చింది. అందులోంచి దిగిన కొంతమందిలో షాలిని ఎవరా అని చూడసాగాడు. ఇంతలో అతని దృష్టి బస్సు దిగుతున్న ఓ యిరవై ఏళ్ళ అమ్మాయిపై పడింది. చుడీదార్ ధరించి వుంది ఆమె. అందంగా, అమాయకంగా వుంది. బస్సు దిగి అక్కడే నిలబడి చుట్టూ చూడసాగింది.

ఆమే షాలిని అన్న నిర్ణయానికి వచ్చి ఆమెని సమీపించి ''షాలిని అంటే మీరేనా?'' అని అడిగాడు.

''అవును. మీరు...?'' అతని వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ అంది.

''నేను శేఖర్ స్నేహితుడిని. వాడికి జ్వరంగా వున్నందువల్ల నన్ను పంపాడు. పదండి వెళదాం'' అన్నాడు ఆమె చేతిలోని బ్యాగ్ తీసుకుంటూ. ఆమె మౌనంగా అతన్ని అనుసరించింది.

మోటర్ బైక్ శబ్దం విని బయటకు వచ్చిన శేఖర్ తల్లిదండ్రులకు బైక్‌పై వున్న శేఖర్, షాలినిలను చూడగానే ఎంతో ముచ్చటేసింది. అందంగా, తెల్లగా యిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' జంటలా కనిపించారు వారి కళ్ళకు.

తన తల్లిదండ్రుల్ని షాలినికి పరిచయం చేసి, మేడపైన వున్న తన గదికి వెళ్ళిపోయాడు శేఖర్, ఆమెను ఫ్రీగా వుంచాలనే ఉద్దేశ్యంతో.

* * *

మరుసటిరోజు ఉదయం కాస్త ఆలస్యంగా నిద్ర లేచాడు శేఖర్.

అప్పటికే నిద్రలేచి, స్నానంచేసి, తల్లికి టిఫిన్ చేయడంలో సహాయం చేస్తున్న షాలినిని చూసి ఆశ్చర్యపోయాడు. నల్లటి చుక్కలున్న తెల్లని చీరలో ఎంతో అందంగా కనబడుతోంది షాలిని. 'ఆ శేఖర్ ఎవడోగాని చాలా అదృష్టవంతుడు' అనుకొన్నాడు. శేఖర్‌ను చూసిన షాలిని కళ్ళతోనే నవ్వింది.

''బాగా నిద్రపట్టిందా'' నవ్వుతూ అడిగాడు.

''ఆహా. కొత్త ప్రదేశం కాబట్టి వేకువఝామునే మెలకువ వచ్చింది. అమ్మ కూడా అప్పటికి లేచేశారు కాబట్టి యిద్దరం మాట్లాడుకొంటూ పనిలో దిగాం'' అంది అతనికి కాఫీ కప్పు అందిస్తూ.

''థాంక్యూ'' అన్నాడు కప్పు అందుకొంటూ.

ఎనిమిది గంటలకు శేఖర్ మార్కెట్‌కు బయలుదేరుతూంటే షాలిని అతని వెనకే గేటు వరకూ వచ్చి ''అమ్మ అన్ని విషయాలు నాతో చెప్పారు. నా ఉత్తరాలతో మిమ్మల్ని ఎంతో యిబ్బంది పెట్టాను. సారీ'' అంది బాధపడుతూ.

''అందులో యిబ్బందేం లేదు. ఎటొచ్చీ ఆ అసలు శేఖర్‌కు మీ ఉత్తరాలు ఎలా అందజెయ్యాలా అన్నది సమస్య అయింది. నాకు తెలిసి మా వీధిలో శేఖర్ అనే పేరుగల వ్యక్తి నేనొక్కడినే. ఎవరింట్లోనైనా అతిథిగా వున్నాడేమో కనుక్కుందామన్నా అది అంత సులభం కాదు. ఎందుకంటే ఈ వీధిలో యాభైకి పైగా యిండ్లు వున్నాయి. అందుకే నేను అతన్ని కనుక్కొనే ప్రయత్నం చెయ్యలేదు. మీరు మాత్రం ఉత్తరాలలో మీ చిరునామా రాయడం అలవాటు చేసుకోండి.''

''అలాగే'' అంది సిగ్గుపడుతూ.

''ఇంతకూ ఆ శేఖర్ ఎలా వుంటాడు? ఎక్కడుంటాడు? అసలు మా అడ్రసు అతనే మీకు యిచ్చాడా?''

''అవును. ఫోనులో చెబుతూంటే విని రాసుకొన్నాను. నేను వినడంలో తప్పు జరిగి వుండొచ్చు''.

''అతను ఎక్కడ పనిచేస్తున్నాడు?''

''అతనికి యింకా ఉద్యోగం దొరకలేదు. ప్రస్తుతానికి ఖాళీగానే వున్నాడు''

''అతను తల్లిదండ్రులతో వుంటున్నాడా?''

''అవును''.

''అయితే నాతోపాటు మార్కెట్‌కు రండి. ఈరోజు ఆదివారం కనుక చాలామంది మార్కెట్‌కు వస్తారు. అక్కడ మీకు శేఖర్ కనిపించవచ్చు''.

ఒక్కక్షణం ఆలోచించి ''అలాగే. అమ్మతో చెప్పి వస్తాను'' అంటూ లోపలికెళ్ళింది.

> **''వీళ్ళది చాలా హ్యాపీ ఫ్యామిలీ. కుటుంబంలో సుఖశాంతులు వుండాలంటే అందుకు ఆ కుటుంబంలోని ప్రతిఒక్కరి సహకారం, సత్ప్రవర్తన అవసరం. అదే ఆ కుటుంబంలో కలతలు రావడానికి, అశాంతి నెలకొనడానికి ఒక్కరి ప్రవర్తన చాలు''**

ఇంతలో పద్మ అతని దగ్గరకొచ్చి ''అన్నయ్య. షాలిని నాకెంతో నచ్చింది. శేఖర్ అదృష్టవంతుడు'' అంది కొంటెగా చూస్తూ.

''అవును. ఆ శేఖర్ అదృష్టవంతుడు'' అన్నాడు. అంత అందమైన అమ్మాయి, అంత చేరువలో వున్న అమ్మాయి మరో వ్యక్తికి సొంతం అన్న భావన అతన్ని ఉదయం నుంచీ బాధిస్తోంది.

షాలిని రావడంతో ఆమెవైపు నవ్వుతూ చూసి ''ఆల్ ది బెస్ట్'' అని లోపలికి వెళ్ళిపోయింది పద్మ.

మార్కెట్‌లో ఆమె వెతుకుతున్న శేఖర్ కనిపించలేదు. అయితే శేఖర్‌తో అలా మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనడం, దారిలో అతనితో కలిసి ఐస్‌క్రీం తినడం ఆమెకు మధురమైన అనుభూతి కలిగించింది. ఆరోజు సాయంత్రం అతని కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్ళడం కూడా ఆమెకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ''వీళ్ళది చాలా హ్యాపీ ఫ్యామిలీ. కుటుంబంలో సుఖశాంతులు వుండాలంటే అందుకు ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరి సహకారం, సత్ప్రవర్తన అవసరం. అదే ఆ కుటుంబంలో కలతలు రావడానికి, అశాంతి నెలకొనడానికి ఒక్కరి ప్రవర్తన చాలు'' అనుకొంది షాలిని తన సవతి తల్లిని తలచుకొంటూ.

* * *

మరుసటిరోజు ఉదయం షాలిని ఒంటరిగా వున్నప్పుడు ఆమెతో చెప్పాడు శేఖర్.

''ఈ వీధి చివర బస్టాపు, ఆటో స్టాండు వుంది. ఎవరు బయటకు వెళ్ళాలన్నా అక్కడకు రావడం తప్పనిసరి. అక్కడ నాకు తెలిసినతని మెడికల్ షాపు వుంది. మీకు అతన్ని పరిచయం చేస్తాను. మీరు తొమ్మిది గంటల నుంచి పదకొండు గంటల వరకు అక్కడ కూర్చుని వచ్చీపోయే వాళ్లను గమనించారంటే మీ శేఖర్ కనబడవచ్చు మీకు''.

అతని ఆలోచనకు, తన మీద వున్న శ్రద్ధకు ఆమెకు ఎంతో ఆనందమేసింది.

''అలాగే'' అంది తలూపుతూ.

తనేది చెప్పినా ఆమె వెంటనే ఒప్పుకోవడం అతనికెంతో నచ్చింది. పన్నెండు గంటలకు ఆఫీసు నుంచి యింటికి ఫోన్ చేసి, షాలిని లైనులోకి వచ్చాక ''శేఖర్ కనిపించారా?'' అని అడిగాడు.

''లేదు''.

''సారీ. సాయంత్రం మళ్ళీ ప్రయత్నించండి''.

''అలాగే''.

ఆరోజు రాత్రి మేడపైని తన గదిలోకి వచ్చిన షాలినిని చూసి ''కూర్చోండి'' అన్నాడు శేఖర్.

ఆమె కూర్చుని ''నేను రేపు బెంగుళూరు వెళ్ళిపోతాను'' అంది.

''అదేం. శేఖర్‌ను కలుసుకోరా?''

''కలుసుకొంటానన్న ఆశ నాకు లేదు''.

''మీరు నిరాశపడకండి'' అన్నాడు. ఆమె అలా నిర్లిప్తంగా, నిరాశగా వుండటం అతను చూడలేకపోతున్నాడు. తర్వాత కొంతసేపు ఆలోచించి,

''మీ శేఖర్ గుళ్ళకు వెళతాడా?'' అని అడిగాడు.

''ఆ. ఆయన షిరిడి సాయిబాబా భక్తుడు''.

''అయితే ఒక పని చేద్దాం. గురువారం సాయంత్రం మనం బాబా గుడికెళదాం. అక్కడికి వస్తాడేమో చూద్దాం.''

''నేను వచ్చి రెండు రోజులయింది. యింకా మూడు రోజులంటే బాగుండదు. ఇప్పటికే మీకందరికీ చాలా శ్రమ యిచ్చాను''.

''ఇందులో శ్రమేం లేదు. మీరు అలాంటి ఆలోచనలు పెట్టుకోకండి. మా యింట్లో ఎవరూ అలా భావించరు. ఇంటికి ఎవరైనా వచ్చినా, నాలుగు రోజులున్నా ఎంతో సంతోషిస్తారు. అతను గురువారం గుడిలో కనబడకపోతే అప్పుడు ఆలోచిద్దాం ఏం చేయాలో''.

''అలాగే. థాంక్యూ. గుడ్‌నైట్''

''గుడ్ నైట్''.

ఆమె వెళ్ళిపోయాక అతని మనసుతోపాటు గది కూడా ఆహ్లాదంగా మారిపోయింది ఆమె జడలోని మల్లెపూల పరిమళం అక్కడ వ్యాపించడంతో. షాలిని మరో మూడు రోజులు తమతో వుంటుందన్న విషయం శేఖర్‌కు ఎంతో ఆనందం కలిగించింది.

* * *

గురువారం సాయంత్రం గుడికి బయలుదే

రారు యిద్దరూ. షాలిని పద్మను కూడా రమ్మని పిలిచింది.

"వద్దు షాలినీ. నేనొచ్చానంటే మనిద్దరం మాటల్లో పడిపోతాం. అప్పుడు అసలు పని మరచిపోయే ప్రమాదం వుంది. నీ శేఖర్ నీకు తప్పకుండా దొరుకుతాడు. నీవాడు అవుతాడు. వెళ్ళిరా" అంది పద్మ.

సాయినాథుని దర్శనం చేసుకొని గుడి బయట ఇసుకలో కూర్చున్నారు. ఏడున్నర వరకూ అక్కడే కూర్చుని గుడికి వచ్చే వాళ్ళను చూస్తూండసాగింది షాలిని.

తర్వాత లేచి "భక్తులంతా వెళ్ళిపోయారు. పదండి. మనమూ వెళదాం" అంది షాలిని.

బయటకు వచ్చాక చల్లగాలి వీస్తూండడంతో అక్కడే నిలబడ్డారు యిద్దరూ. మనసుకు ఎంతో హాయిగా అన్పించింది యిద్దరికీ. ఆ వాతావరణం వారికెంతో నచ్చింది.

"ఐ యామ్ సారీ" అన్నాడు శేఖర్ బాధగా. తను యిన్నివిధాలా ప్రయత్నించినా ఆమెకు శేఖర్ కనిపించకపోవడం అతన్ని బాధించింది.

"సారీ ఎందుకు? మీ ప్రయత్నం మీరు చేశారుగా".

"మా యింటికి వచ్చిన వ్యక్తిని అసంతృప్తితో పంపడం మాకు బాధాకరం కాదా?"

"నన్ను సంతృప్తితో పంపాలని మీకు నిజంగా ఉందా?"

"అవును".

"అయితే అది మీ ఒక్కరి చేతుల్లోనే వుంది".

"అదెలా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నా మనసులోని శేఖర్ మీరే".

నమ్మలేనట్టు చూశాడు ఆమెవైపు. అతను ఊహించని విషయం యిది. అయితే యీ విషయం అతనికి ఆనందాన్నే యిచ్చింది.

"మీరు నా మనసులో ఎలా ప్రవేశించారో చెప్పాలంటే ఆ కథ మొత్తం చెప్పాలి. నేను మా అమ్మానాన్నలకు ఏకైక కుమార్తెను. మా అమ్మానాన్నలది ప్రేమ వివాహం. నాన్నకు అమ్మంటే ప్రాణం. వాళ్ళిద్దరికీ నేనంటే ప్రాణం. నాకు పన్నెండేళ్ళు వచ్చేవరకు మాది ఏ చీకూ చింతా లేని ఆనందమైన కుటుంబం. మా ఆనందాన్ని హరించడానికి మా అమ్మకు ముందు జ్వరంగా వచ్చి తర్వాత మృత్యువుగా మారింది ఓ జబ్బు. ఆ జబ్బు పేరు లుకేమియా. ఆ తర్వాత అమ్మ మమ్మల్ని ఎక్కువ కష్టపెట్టకుండా వెళ్ళిపోయింది.

నాన్న జీవితంలో పిన్ని ప్రవేశించింది. ఆవిడ నాన్న ఆఫీసులోనే పనిచేసేది. సాధారణంగా సవతి తల్లికి తనకు పిల్లలు పుట్టిన తర్వాత సవతి పిల్లలపై ప్రేమ తగ్గడం, ద్వేషం పెరగడం జరుగుతూంటుంది. కాని మా పిన్ని మా యింట్లో అడుగు పెట్టిన క్షణం నుంచే నన్ను ద్వేషించడడం మొదలు పెట్టింది. ఆమె భర్త మనసులో తను తప్ప యింకెవరూ వుండటానికి వీల్లేదట. ఇంతలో నాన్నగారికి ప్రమోషన్ వచ్చి ఆయన పూర్తిగా ఉద్యోగానికే అంకితం అయిపోయారు. నా బాధ వినేవారు కాని, నన్ను ఓదార్చేవారు కాని కరవయ్యారు. మా పిన్నికి యిద్దరు పిల్లలు పుట్టారు. అయినా నేనంటే ద్వేషం పోలేదు. నన్ను సతాయించడం మానలేదు. నాచేత అన్ని పనులూ చేయించేది. అన్నీ చేసినా మనసు బాధపడేలా నానామాటలూ అనేది. ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాను గాని ధైర్యం చాల్లేదు.

ఈ బాధల నుంచి విముక్తి పొందాలంటే నేను బాగా చదువుకొని మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని మా టీచర్ చెప్పారు. అప్పట్నుంచీ యింట్లో ఎన్ని పనులు చేసినా చదువుకు కూడా సమయం కేటాయించి మంచి మార్కులతో పాసవుతూ బిఎస్సి పూర్తిచేశాను. ఉద్యోగంకోసం ప్రయత్నించసాగాను. కానీ ఉద్యోగాలు అంత సులువుగా దొరకడం లేదు కదా. అందువల్ల నా ప్రయత్నాలు ఫలించలేదు. చదువు పూర్తయి, ఉద్యోగం లేకుండా యింట్లో వుండడం ఎంత నరకమో అర్థమైంది. ఊరికే కూర్చుని తింటున్నావని మా పిన్ని నానా మాటలూ అనేది. కావాలని పనులు కల్పించి నన్ను చెయ్యమనేది. అలసిన నా శరీరం మొండికేస్తే

**మీరు మంచివారని, సున్నిత మనస్కులని, తల్లిదండ్రులంటే గౌరవం వున్నవారని, ఎవర్నీ నొప్పించరని నాకు అనిపించింది. మీలాంటి వ్యక్తి తోడుంటే జీవితం ఎంత ఆనందభరితంగా వుంటుందో అనుకున్నాను. ఎందుకంటే తల్లి దండ్రుల్ని ప్రేమించేవాడు భార్యను కూడా ప్రేమిస్తాడని, గౌరవిస్తాడని నా నమ్మకం.**

తిండి పెట్టేది కాదు. ఇన్ని బాధలు పడుతున్నా నాకంటూ ఎవరూ లేరే అన్న ఆలోచన నన్ను మరింత బాధించేది. నా మనసు అర్థం చేసుకొన్న మనిషి దొరికితే వారి అక్కున చేరి మనసుతీరా ఏడ్వాలని అనిపించేది.

ఓరోజు ఓ వారపత్రికలో ఓ కవిత చదివాను. అమ్మ మీద వ్రాసిన కవిత అది. ఆ కవిత నా మనసును కదిలించింది. మా అమ్మను తలుచుకొని ఏడ్చేశాను. అంత హృద్యంగా రాసిన కవి ఎవరా అని చూశాను. మీ ఫోటో, చిరునామా కనిపించింది. కవిత మళ్ళీ మళ్ళీ చదువుతూ మీ మనస్తత్వాన్ని బేరీజు వేసుకోసాగాను. మీరు మంచివారని, సున్నిత మనస్కులని, తల్లిదండ్రులంటే గౌరవం వున్నవారని, ఎవర్ని నొప్పించరని నాకు అనిపించింది. మీలాంటి వ్యక్తి తోడుంటే జీవితం ఎంత ఆనందభరితంగా వుంటుందో అనుకున్నాను. ఎందుకంటే తల్లిదండ్రుల్ని ప్రేమించేవాడు భార్యను కూడా ప్రేమిస్తాడని, గౌరవిస్తాడని నా నమ్మకం. మీతో పరిచయం చేసుకొని, మీరు, ఆ భగవంతుడు అనుమతిస్తే మిమ్మల్ని పరిణయమాడాలని అనుకొన్నాను.

అయితే మీకు పెళ్ళయిందో లేదో ఎలా కనుక్కోవాలి? వెంటనే ఓ ఉపాయం తోచింది. 'మా అమ్మాయిని మీ అబ్బాయికి యివ్వాలనుకొంటున్నాం' అని నాన్న వ్రాసినట్లు ఓ ఉత్తరం రాశాను మీ నాన్నగారికి. మంచిరోజు చూసి తెలిపితే వచ్చి పిల్లను చూస్తామని మీ నాన్నగారు రాశారు. మీకు యింకా పెళ్ళికాలేదని ఆవిధంగా కన్ఫర్మ్ చేసుకొన్నాను.

అప్పుడే నాకీ ఉత్తరాల ఆలోచన వచ్చింది. అంత సున్నితమైన మనసు కలవారు అర్ధరాత్రి నన్ను ఒంటరిగా వదలరనే నమ్మకం వున్నందువల్లే రాత్రిపూట ప్రయాణాన్ని ఎన్నుకొన్నాను. అదే ఏ మధ్యాహ్నమో చిత్తూరు వచ్చినట్లయితే మీరు బస్టాండుకు వచ్చేవారు కారేమో. ఈవిధంగా రావడం వల్ల మీ గురించి, మీ యింట్లోని వ్యక్తుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు వచ్చింది. మీ వారంతా నాకెంతో నచ్చారు. నేను మీకు నచ్చితే నేనూ మీ కుటుంబంలోని వ్యక్తిని కావాలనుకొంటున్నాను".

శేఖర్ నమ్మలేకపోతున్నాడు. ఎక్కడో బెంగుళూరులో వున్న అమ్మాయి తన కవిత చదివి, తనను పెళ్ళాడటానికి యింత ప్లాన్ వేసుకొని, తనను చేరుకోవడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అదే మాట షాలినితో అన్నాడు.

"నా జీవితంలో వెలుగు, ఆనందం రావాలంటే ఈమాత్రం ధైర్యం, తెగువ చూపడంలో తప్పులేదనిపించింది. ఎంతో ప్లాన్ చేశాను కనుకే ఉత్తరాల్లో నా చిరునామా రాయలేదు. ఫోన్ నెంబర్ ఇవ్వలేదు. బస్టాండులో మిమ్మల్ని నేను గుర్తుపట్టినా బయటపడలేదు" అంది షాలిని.

"మీ తెలివికి, ధైర్యానికి నా జోహార్లు".

"మరి నా గురించి మీరేమనుకుంటున్నారు? బరితెగించిందని, మిమ్మల్ని మోసం చేశానని అనుకొంటున్నారా?"

"లేదు. పెళ్ళి తప్పనిసరి అయినప్పుడు తనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకొని, పరిశీలించి, పరిణయమాడే అవకాశాన్ని మీరు కోరుకోవడంలో తప్పులేదు".

"థాంక్యూ. నన్ను బెంగుళూరు సంతృప్తిగా పంపిస్తున్నారా?" కుతూహలంగా అతన్నే చూస్తూ అంది.

"అవును. అది మా ఆనందం కూడా. మా అమ్మానాన్నలకు మనిషిగా మీరు నచ్చారు. కోడలిగా కూడా నచ్చుతారనే నా నమ్మకం".

"థాంక్యూ" అంది ఎంతో సంతోషంగా.

"మనం ఒకటవాలని నిర్ణయించుకున్న ఈ శుభ సమయాన మనం మళ్ళీ గుడిలోకి వెళ్ళి ఆ సాయినాథునికి కృతజ్ఞతలు చెప్పి వద్దాం వస్తారా?" అని అడిగాడు శేఖర్.

"అలాగే" అంది ఎప్పటిలాగే తలాడిస్తూ. ఈసారి ఆమె అలా తలూపుతుంటే ఎంతో ముచ్చటేసింది అతనికి.

"మీరు యిన్ని అబద్ధాలు చెప్పినా ఒక్కటి మాత్రం నిజం చెప్పారు" అన్నాడు శేఖర్ గుడి మెట్లు ఎక్కుతూ.

"ఏమిటది?" ప్రశ్నార్థకంగా అతనివైపు చూస్తూ అడిగింది షాలిని.

"మీ శేఖర్ షిరిడీ సాయి భక్తుడని".

షాలిని అందంగా నవ్వింది.

★